క్లుప్తంగా

నాణ్యతలో రాజీ పడొద్దు

నడిగూడెం : మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం కింద రూ.12 లక్షలతో చేపడుతున్న అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణ పనులను బుధవారం పంచాయతీ రాజ్ శాఖ డీఈఈ ఆర్.హర్ష తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నాసిరకంగా చేపడితే చర్యలు తీసుకుంటామని అన్నారు. నాణ్యతలో రాజీ పడవద్దన్నారు. ఆయన వెంట ఏఈఈ లావణ్య తదితరులు ఉన్నారు.

ఆలయాలు నిర్మించాలి

మేళ్లచెరువు : మండలంలోని వెల్లటూరు గ్రామంలో బుధవారం పురావస్తు శాఖ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని బాల ఆలయాన్ని పరిశీలించారు. నూతన దేవాలయాల నిర్మాణాలకు సంబంధించిన స్థలం, తదితర వివరాలపై ఆరా తీశారు. కాగా, పులిచింతల ముంపునకు గురి కావడంతో గత పదమూడు సంవత్సరాలుగా పునరావాస గ్రామమైన వెల్లటూరులో నివాసం ఉంటున్నామని, నాటి నుంచి గ్రామంలో దేవాలయాలు నిర్మించకుండా కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో గ్రామంలో దేవాలయాలు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

భూసేకరణ ప్రాథమిక సర్వే పరిశీలన



ఆర్–9 లిఫ్ట్ పైప్‌లైన్ నిర్మాణానికి చేపడుతున్న భూ సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీఓ

మునగాల : మండలంలోని సాగర్ ఎడమ కాలువపై నిర్మించిన ఆర్–9 ఎత్తిపోతల పథకానికి అనుబంధంగా ఏర్పాటు చేసే పైపులైన్ నిర్మాణానికి చేపడుతున్న భూసేకరణ ప్రాథమిక సర్వేను బుధవారం కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో చేపడుతున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. సర్వేలో తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఆర్ఐ రామారావు, ఇన్‌చార్జ్ సర్వేయర్ సరిత, రైతులు ఉన్నారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేత



ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేస్తున్న మిడ్ వెస్ట్ కంపెనీ ప్రతినిధులు

కోదాడరూరల్ : మండలంలోని నల్లబండగూడెం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రానికి మంగళితండా శివారులో గల మిడ్ వెస్ట్ క్వారీ కంపెనీ ప్రతినిధులు బుధవారం ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ.. తమ కంపెనీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ జీఎం ఏ.శ్రీనివాస్, హెచ్ఆర్ తరుణ్, అకౌంటెంట్ జి.శ్రీనివాస్, వైద్య సిబ్బంది అనిత, ఆశలు ఉన్నారు.

అంతరిక్షంలోని గ్రహాలను వీక్షించిన విద్యార్థులు



టెలిస్కోప్‌తో అంతరిక్షంలోని గ్రహాలను వీక్షిస్తున్న విద్యార్థులు

మేళ్లచెరువు : స్కైవాచ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం టెలిస్కోప్ సహాయంతో అంతరిక్షంలోని గ్రహాలను వీక్షించారు. ఈ సందర్భంగా నక్షత్రాలు, గ్రహాల స్థితిని పరిశీలించారు. అంతరిక్షానికి సంబంధించి విద్యార్థుల సందేహాలను ఉపాధ్యాయులు నివృత్తి చేశారు. ఎంఈఓ వెంకటరెడ్డి, నారపరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



నర్సయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ట్రాక్టర్ యజమానుల అసోసియేషన్ సభ్యులు

మునగాల : మండలంలోని తాడువాయిలో వీరబోయిన నర్సయ్య (45) ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. బుధవారం గ్రామానికి చెందిన ట్రాక్టర్ల యజమానులు ట్రాక్టర్ యజమానుల అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.45 వేలను మృతుడి కుమారుడు సైదులుకు అందజేశారు. ఈ సందర్భంగా నర్సయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రాక్టర్ల యజమానులు పి.ఎల్లారెడ్డి, సీహెచ్.శ్రీను, ఎల్.శంకర్, ఎల్.సంజీవ్, ఎల్.రమేష్, జి.మురళి, రాజ్‌కమల్, వీరబాబు, యాదగిరి పాల్గొన్నారు.

ప్రారంభం కాకముందే ప్రమాదాలు

- భూగర్భంలో మంచినీటి పైపుల పక్కనే గ్యాస్ పైప్‌లైన్ ఏర్పాటు
- తాగునీటి పైపుల లీకేజీలతో తవ్వుతున్న మున్సిపల్ సిబ్బంది
- గునపం తగిలి తరచూ ప్రమాదాలు



బాలికల పాఠశాల వద్ద మంగళవారం గ్యాస్ పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కోదాడ : పట్టణంలో భూగర్భం లోపలినుంచి ఏర్పాటు చేసిన గ్యాస్ పైప్‌లైన్ ప్రమాదకరంగా మారింది. గ్యాస్‌లైన్ ఏర్పాటులో సంబంధిత సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో గ్యాస్ పంపిణీ ప్రారంభం కాకముందే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గడిచిన రెండు నెలల కాలంలోనే రెండుసార్లు ప్రమాదం జరిగింది. కానీ ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకపోవడంతో పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే పట్టణంలో గ్యాస్ పైప్‌లైన్ వేసినట్లు, దానిని టెస్టింగ్ చేస్తున్నట్లు కోదాడ అగ్నిమాపక శాఖకు కనీస సమాచారం కూడా లేకపోవడం గమనార్హం.

రెండు నెలల్లో రెండు ప్రమాదాలు..

కోదాడ పట్టణంలో ఒక ప్రముఖ ప్రైవేట్ కంపెనీ అండర్ గ్రౌండ్ గ్యాస్ పైప్ లైన్ వేసింది. దీని ద్వారా ఇంటింటికీ గ్యాస్ పంపిణీ చేయనున్నారు. అయితే ఈ గ్యాస్ పైప్‌లైన్ మంచినీటి పైప్‌లైన్ పక్కనే వేశారు. కొద్దిరోజులుగా ఈ గ్యాస్ కంపెనీ పైప్‌లైన్‌లో గ్యాస్ పంపి టెస్ట్ చేస్తున్నారు. ఈ విషయం మున్సిపాలిటీ సిబ్బందికి తెలియదు. మంగళవారం పట్టణంలోని ఆజాద్‌నగర్ బాలికల పాఠశాల వద్ద మంచినీటి పైప్‌లైన్ లీకేజీ కావడంతో మున్సిపల్ సిబ్బంది అక్కడ తవ్వారు. ఈ క్రమంలో గునపం గ్యాస్ పైప్‌లైన్‌కు తగలడంతో పెద్ద శబ్దంతో గ్యాస్ లీకై పాఠశాలలో విద్యార్థులు, ఆ వీధి వాసులు భయాందోళన చెందారు. ఇదే విధంగా నెల రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు ఇంటి సమీపంలో గ్యాస్ లీక్ కావడంతో ఆ ప్రాంత వాసులు ఆందోళనకు గురయ్యారు.

కనీస సమాచారం కరువు..

పట్టణంలో భూగర్భ గ్యాస్ పైప్‌లైన్ వేసిన విషయం, దానిలో గ్యాస్ సరఫరా చేస్తున్న సమాచారం తమకు తెలియదని మున్సిపల్, అగ్నిమాపక శాఖ సిబ్బంది అంటున్నారు. పలు వీధుల్లో తరచూ మంచినీటి పైపుల లీకేజీ అవుతుండడంతో తాము తవ్వాల్సి వస్తుందని, మంగళవారం తవ్విన చోట కూడా గ్యాస్ పైప్‌లైన్ ఉందనే విషయం తమకు తెలియదని చెబుతున్నారు. గ్యాస్ కంపెనీ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో గ్యాస్ పైప్‌లైన్ ఉన్న చోటుపై సిబ్బందికి అవగాహన కల్పించాలని, భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రైతులను మోసం చేసిన కాంగ్రెస్



నేలమర్రిలో ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్



కోదాడరూరల్ : రఘు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

మునగాల : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఆరోపించారు. మునగాల మండలంలోని నేలమర్రి గ్రామంలో సాగునీరు అందక ఎండిపోతున్న వరిపైర్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండవ పంటకు వారబందీ పద్ధతిలో సాగునీరు అందిస్తామని ప్రభుత్వం ముందుగా ప్రకటించిడంతో రైతులు వరిసాగు చేశారని, ఇప్పుడు సాగునీరు విడుదల చేయకపోవడంతో వరిపైర్లు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తన సొంత జిల్లాలో పైర్లు ఎండిపోతుంటే భారీ నీటిపారుదల శాఖ మంత్రి పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటికే కాక తాగునీటికి కూడా కటకట ఏర్పడే ప్రమాదముందని, పరిస్థితి ఇదేవిధంగా కొనసాగితే కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో మంత్రి, ఎమ్మెల్యేను తిరగనియ్యమని, రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు సుంకర అజయ్‌కుమార్, తొగరు రమేష్, కందిబండ సత్యనారాయణ, పాశం లక్ష్మారెడ్డి, ఉడుం కృష్ణ, ఎలక వెంకటరెడ్డి, దొంగరి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టు రఘు మృతి బాధాకరం

కోదాడరూరల్ : జర్నలిస్టు పడిశాల రఘు మృతి కోదాడ మీడియా రంగానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో నిర్వహించిన రఘు సంతాప సభలో పాల్గొని ఆయన పాల్గొని రఘు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అదేవిధంగా పలు పార్టీల నాయకులు, జర్నలిస్టు సంఘాల నాయకులు రఘు సంతాప సభలో పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే 143 యూనియన్ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారింగుల అంజన్‌గౌడ్, జిల్లా ప్రధాన కారదర్శి నారపరాజు హరికిషన్‌రావు, ఎమ్మార్పీఎస్, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మంత్రి సహకారంతో గ్రామాభివృద్ధి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మఠంపల్లి : మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో మఠంపల్లి మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కాంగ్రెస్ మండల నాయకుడు ఆదూరి కిషోర్‌రెడ్డి అన్నారు. బుధవారం మఠంపల్లిలోని హోసన్నామందిర్ నుంచి వీవీ హైస్కూల్ వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో బ్రదర్ వినోద్‌రెడ్డి, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు కొత్తపల్లి శౌరి, మాజీ సర్పంచ్ కృపానందం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దైదా రాయలు, మాజీ ఎంపీటీసీ ప్రభుదాసు, కర్నె వెంకటేశ్వర్లు, రాంచంద్రారెడ్డి, జయభారత్‌రెడ్డి, బుచ్చయ్య, జార్జిరెడ్డి, హనుమంతు, వీరబాబు, ఆనంద్‌రెడ్డి, జానీపాషా, ఎస్.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై లైంగిక దాడులను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న శిరోమణి

నేరేడుచర్ల : మహిళలపై లైంగిక దాడులతో పాటు శ్రమ దోపిడీని అరికట్టాలని ప్రగతి శీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి చల్లగుండ్ల శిరోమణి డిమాండ్ చేశారు. బుధవారం నేరేడుచర్లలో జరిగిన సంఘం నాయకురాళ్ల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 1వ తేదీ నుంచి 8వరకు గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని, కానీ మహిళలకు సగం వేతనమే ఇస్తూ శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పని ప్రదేశాల్లో మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకురాళ్లు చందనబోయిన లక్ష్మి, సయ్యద్ రేష్మా, పావని, శ్యామల, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ నాయకురాలు సందే సత్యమ్మ, పడిశాల మరియమ్మ, మల్లేశ్వరి, మౌలాంబి, ఫాతిమా, నరసమ్మ, బుచ్చమ్మ, లక్ష్మమ్మ, నాగేంద్ర, జానకమ్మ, సావిత్రమ్మ, అలివేలు, నాగమణి తదితురులు ఉన్నారు.

రామాలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

హుజూర్‌నగర్ : పట్టణ పరిధిలోని గోవిందపురంలో రామాలయం నిర్మాణానికి బుధవారం ఇట్టిమల్ల బెంజిమెన్ –తిరుపమ్మ దంపతులు రూ 10,116 విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు ఇట్టిమల్ల శ్రీనివాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొల్లెద్దు జైలు, ఇట్టిమల్ల వినోద్, ఇట్టిమల్ల విమన్, దాసరి రాంబాబు, ఊదరి రంజిత్, ముడుసు పాపారావు తదితరులు పాల్గొన్నారు

కీతవారిగూడెం గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలి

గరిడేపల్లి : మండలంలో కొత్త మండలాన్ని ఏర్పాటు చేసి కీతవారిగూడెం గ్రామాన్ని మండల కేంద్రం చేయాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బుధవారం గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. 2023 ఎన్నికల ప్రచారంలో నాయకులు చేసిన వాగ్దానం మేరకు కీతవారిగూడెంను మండల కేంద్రంగా ప్రకటించాలని అన్నారు. కోదాడ– మిర్యాలగూడెం ప్రధాన రహదారిపై కీతవారిగూడెం ఉందని, ఈ గ్రామంలో అన్ని సదుపాయాలు ఉన్నందున మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలు గ్రామాల ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ అందాల పోటీలను వ్యతిరేకించాలి



సమావేశంలో పాల్గొని నినాదాలు చేస్తున్న పీఓడబ్ల్యూ నాయకులు

గరిడేపల్లి : హైదరాబాద్‌లో ఈ నెల 8న జరిగే ప్రపంచ అందాల పోటీలను వ్యతిరేకించాలని ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, పల్లెపంగు కళ్యాణి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని గడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్పొరేట్ శక్తులు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరింపజేసుకోవడానికి ప్రభుత్వాలతో కలిసి ఈ అందాల పోటీలు నిర్వహిస్తున్నాయని అన్నారు. మహిళలను అణచివేతకు గురిచేసే ఈ పోటీలను అడ్డుకుంటామని అన్నారు. కార్యక్రమంలో వరలక్ష్మి, భూలక్ష్మి, జ్యోతి, సుశీల, లింగమ్మ, సైదమ్మ, ధనమ్మ, ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

సోమప్ప దేవాలయానికి రూ.3,64,776 ఆదాయం

నేరేడుచర్ల : మండలంలోని సోమప్ప దేవాలయానికి మహాశివరాత్రి సందర్భంగా వచ్చిన హుండీ ఆదాయాన్ని బుధవారం దేవాదాయ శాఖ, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించారు. ఒక సంవత్సరం హుండీ ఆదాయం రూ. 1, 10, 876 కాగా టికెట్ల ద్వారా రూ.63,900, కొబ్బరికాయలు విక్రయించేందుకు నిర్వహించిన వేలం ద్వారా రూ.1.50 లక్షలు, లడ్డూ, పులిహోర విక్రయానికి వేలం ద్వారా రూ.85 వేలు ఆదాయం సమకూరినట్లు దేవాదాయ శాఖ మిర్యాలగూడ డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు తెలిపారు. ఆలయానికి మొత్తం ఆదాయం 3 లక్షల 64 వేల 776 రూపాయలు వచ్చినట్లు తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ చైర్మన్ చిత్తనూరి సత్యనారాయణ, ధర్మకర్తలు లొడంగి లక్ష్మయ్య, పెండెం సైదులు, సోమయ్య, బాలామణి, ఆలయ ప్రధాన అర్చకులు ఇటువంటి శ్రీనివాస్‌శాస్త్రి, నాగునాయక్, కృష్ణారావు, భిక్షం, వెంకయ్య, సైదులు, నరసయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, వెంకన్న, లక్ష్మయ్య, అజిత్, అజయ్, చందు, కిట్టయ్య, సురేష్, రవి, లింగయ్య, గోపాలకృష్ణ, మల్లికార్జునరావు తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇల్లు నిర్మాణ పనుల పరిశీలన

నడిగూడెం : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చేపట్టిన ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను బుధవారం గృహ నిర్మాణ శాఖ జేఈ జేఎస్ఎన్ మూర్తి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మండల పరిధిలోని కాగితరామచంద్రాపురం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్ట్‌గా తీసుకున్నామని, ఆ గ్రామంలో 40 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ఇంటి స్థలాల్లో మార్కింగ్ చేసి, ప్రత్యేక యాప్‌లో నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆయన వెంట ఎంపీడీఓ దాసరి సంజీవయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూతుకూరి వెంకటరెడ్డి, కాంట్రాక్టర్ ఎండి.అఫ్జల్, తదితరులు ఉన్నారు.

ముగిసిన ధ్యానోత్సవం

చిలుకూరు : మండల కేంద్రంలో హార్ట్ ఫుల్ నెస్, రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ధ్యానోత్సవం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆ సంస్థ జోనల్ కోఆర్డినేటర్ సీహెచ్.వరప్రసాద్, శిక్షకులు సీహెచ్ ఎల్ఎన్.చారి, నారాయణరెడ్డి వివిధ ధ్యాన పద్ధతులను పవర్ పాయింట్ ప్రదర్శనతో వివరించారు. అనంతరం ప్రముఖ ఫ్లూట్ విద్వాంసుడు వేముల కోటయ్య ఫ్లూట్‌తో సంగీతాన్ని వినిపించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో గంగిరెడ్డి వెంకటరెడ్డి, కస్తూరి రాములు, బొడ్డు వీరయ్య, కేతిరెడ్డి రామిరెడ్డి, కనకదుర్గ, విజయశ్రీ, స్వర్ణలత, శ్రీనివాసరెడ్డి, శంకర్, లక్ష్మి, గ్రామ పెద్దలు హుస్సేన్, సైదులు, వెంకటయ్య, దశరథ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు కాకతీయ సేవా సమితి చేయూత



విద్యార్థులకు ఆర్థికసాయం అందజేస్తున్న కాకతీయ సేవా సమితి సభ్యులు

కోదాడరూరల్ : చదువులో ప్రతిభ చూపుతున్న నిరుపేద విద్యార్థులకు కాకతీయ సేవా సమితి అండగా ఉంటుందని సమితి సభ్యులు అన్నారు. బుధవారం కోదాడ పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న కాకతీయ కల్యాణ మండపం వద్ద పలువురు పేద విద్యార్థులకు రూ.1,10,000 ఆర్థిక సాయం అందజేసి మాట్లాడారు. కులమతాలకు అతీతంగా ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు పెద్దనాటి వెంకటేశ్వరరావు, సురేష్, డాక్టర్ సుబ్బారావు, ముత్తవరపు పాండురంగారావు, రావెళ్ల సీతరామయ్య, గంటా సత్యనారాయణ, కాకర్ల వెంకటేశ్వరరావు, బొల్లు రాంబాబు తదితరులు ఉన్నారు.

ఇంటిపన్ను విధిగా చెల్లించాలి

మునగాల : ప్రతిఒక్కరూ ఇంటిపన్ను విధిగా చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని మునగాల గ్రామ పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ కోరారు. బుధవారం గ్రామంలో పర్యటించి పలు వార్డుల్లో సమస్యలను గుర్తించారు. ఈ సందర్భంగా ఇంటి పన్నులు వసూలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఆయన అన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభం



నేరేడుచర్లలో విద్యార్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపుతున్న అధికారులు

కోదాడ : పట్టణంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. బుధవారం ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు సంస్కృతం, తెలుగు పరీక్షలు రాశారు. పట్టణంలో 8 సెంటర్లలో 2,147 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 2053 మంది హాజరయ్యారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల ఆవరణలో 144 సెక్షన్ విధించడంతో పాటు ప్రతి కేంద్రం వద్ద నలుగురు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : పట్టణంలో ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్‌లో 193 మంది విద్యార్థులకు గాను 177 మంది విద్యార్థులు, ప్రియదర్శిని జూనియర్ కళాశాలలో 249 మందికి 238 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయా కళాశాలల చీఫ్ సూరింటెండెంట్లు బ్రహ్మాచారి, ప్రణతి తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఆర్డీఓ శ్రీనివాసులు తనిఖీ చేశారు.

నేరేడుచర్ల : పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 353 మంది విద్యార్థులకు గాను 340 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. చీఫ్ సుపరింటెండెంట్ వెంకటరమణ, డీఓ శ్రీనివాస్‌తో పాటు 13 మంది ఇన్విజిలేటర్లు విధులు నిర్వహించారు. పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను తహసీల్దార్ సైదులు పరిశీలించారు.

ఆకట్టుకున్న భక్త చింతామణి నాటకం



భక్తచింతామణి పద్యనాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

మఠంపల్లి : మండలంలోని యాతవాకిళ్లలో మహాశివ రాత్రి ఉత్సవాలలో భాగంగా శ్రీవేంకటేశ్వర నాట్యకళామండలి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారుజామువరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీనియర్ రంగస్థల కళాకారులు ప్రదర్శించిన భక్త చింతామణి పద్య నాటకం ప్రేక్షకులను రంజింపజేసింది. ఈ నాటకాన్ని మాజీ సర్పంచులు కోలాహలం కృష్ణంరాజు, లక్ష్మీనరసింహరాజు, తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ధర్మారి వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు భువనగిరి ప్రకాశ్‌బాబు ప్రారంభించారు. ప్రముఖ హార్మోనిస్ట్ పి. వినాయకరాజు దర్శకత్వంలో ఈ నాటకం ప్రదర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు నాగయ్యయాదవ్, శాంతినర్సింహారెడ్డి, వెంకన్న, నాగయ్య, రామరాజు, కళాకారులు షేక్ సైదులు, ఉప్పు కృష్ణారావు, ఏసురాజు, షిలార్, వెంకటేశ్వర్లు, వీరమణి, అశ్విని, శాంతి, భద్రయ్యాచారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



జెండా ఆవిష్కరిస్తున్న మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లేశ్వరి

చిలుకూరు : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మహిళా సమాఖ్య (సీపీఐ అనుబంధ సంఘం) జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని దొడ్డా నర్సయ్య భవన్ వద్ద మహిళా సమాఖ్య జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలన్నారు. మహిళలపై అత్యాచారాలు జరిగితే ఆ కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు రెమిడాల జయసుధ, సాతులూరి అలివేలు, మహమూదాబేగం, దొడ్డా పార్వతమ్మ పాల్గొన్నారు.

వైద్యశిబిరం ఏర్పాటు అభినందనీయం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కోదాడ : పేదల కోసం మెగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు అన్నారు. బుధవారం పట్టణంలోని పబ్లిక్ క్లబ్ ఆవరణలో శంకర్ కంటి ఆసుపత్రి, పబ్లిక్ క్లబ్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. కాగా, ఈ శిబిరంలో 200 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు గాయం పట్టాభిరెడ్డి, బొల్లు రాంబాబు, మేకల వెంకట్రావ్, సత్యనారాయణ, శేఖర్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, రాబిన్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

గరిడేపల్లి : మాదక ద్రవ్యాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని హెడ్‌కానిస్టేబుల్ సైదమ్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలపై నిర్వహించిన పోలీస్ కళాజాతాలో ఆమె మాట్లాడారు. సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని, వేధింపులపై 100కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం కళాజాత బృందం ఆటాపాటలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఓ శైలజ, కానిస్టేబుళ్లు రఫీయాబేగం, పోలీస్ సిబ్బంది నగేష్, ప్రశాంత్, గోపి, రాము, అవినాష్, కళాజాత బృందం ఇన్‌చార్జ్ యల్లయ్య, గోపయ్య, కృష్ణ, నాగార్జున, చారి తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా వెంకటరెడ్డి

నడిగూడెం : మండలంలోని నారాయణపురంలో బుధవారం యూత్ కాంగ్రెస్ సమావేశం మండల అధ్యక్షుడు గుండు మహీందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా నాగిరెడ్డి వెంకటరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు పగిళ్ల ఉపేందర్, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, గ్రామ శాఖ అధ్యక్షుడు వీరారెడ్డి, మాజీ సర్పంచ్ నాగేందర్‌రెడ్డి, గురులింగం, పల్లపు గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్న కవలల అసోసియేషన్ సభ్యులు

కోదాడ : విద్యార్థులు కష్టపడి చదివి లక్ష్యాలను సాధించాలని కోదాడ మండల విద్యాధికారి ఎండీ. సలీం షరీఫ్ అన్నారు. బుధవారం కోదాడ బాలుర పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు కోదాడ కవలల అసోసియేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో చలిగంటి రామారావు, లక్ష్మణ్, నోముల శరత్, కొల్లూరు శ్రీనివాస్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ తనిఖీ

నడిగూడెం : కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని మండల విద్యాధికారి బాజా ఉపేందర్‌రావు తెలిపారు. బుధవారం మండలంలోని కరివిరాల మోడల్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

ఏఐను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

కోదాడ : విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ) గురించి ఆందోళన చెందొద్దని, దానిని సద్వినియోగం చేసుకొని వృద్ధి సాధించాలని స్లేట్ ది స్కూల్ ఫౌండర్ వాసిరెడ్డి అమరనాథ్ కోరారు. బుధవారం కోదాడలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో అమృత రామానుజరావు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ట్రస్ట్ నిర్వాహకులు కొండపల్లి శేషప్రసాద్, నాగార్జునరావు, గాంధీ, రంగారావు, శారద, శ్రీ వాత్సవ్, శ్రీకర్, యశ్వంత్ పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం అందజేత

నేరేడుచర్ల : మండలంలోని జానలదిన్నె గ్రామానికి చెందిన చిట్యాల మంగయ్య రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. బుధవారం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త తక్కెళ్ల నాగార్జున చొరవతో భాణావత్ వెంకటేశ్వర్లు మంగయ్యకు రూ.5 వేల ఆర్థికసాయంతో పాటు 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. రాపోలు నవీన్‌కుమార్, శ్రీనివాస్, స్థానికులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామ పంచాయతీ పరిధిలో అర్హులైన ప్రతిఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని బీసీ సంఘం మండల ప్రధాన కార్యదర్శి కోల ఆంజనేయులు కోరారు. ఈమేరకు బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రామునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. తాడువాయిని రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్ట్ గ్రామంగా ఎంపిక చేసిందని, మొదటి విడతలో 108 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామంలో ఇంకా అనేకమంది అర్హులు ఉన్నారని, కావున లెవల్– 2, లెవల్– 3 కేటగిరిలో ఉన్న పేదలకు లెవల్– 1లోకి మార్చి ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ సంఘం నాయకులు లొడంగి వెంకయ్య, భీమ్లా పాల్గొన్నారు.